ప్రజాశక్తి

ఆదివారం 28 ఏప్రిల్ 2024 పేజీలు 8

విజయనగరం

పార్వతీపురం మన్యం

ఎన్నికల సిబ్బంది కేటాయింపు ప్రక్రియలో పాల్గొన్న ఉన్నతాధికారులు

ఎన్నికల విధుల్లో

12,522 మంది సిబ్బంది

- నియోజకవర్గాల కేటాయింపు ప్రక్రియ పూర్తి
- మహిళా ఉద్యోగులకు అదే నియోజకవర్గం కేటాయింపు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో వచ్చే నెల 13న జరగనున్న సాధారణ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు అవసరమైన పిఒ, ఎపిఒ., ఒపిఒల కేటాయింపు ప్రక్రియ శనివారం పూర్తయ్యింది. కలెక్టర్ కార్యాలయంలోని నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ లో రేండమైజేషన్ ప్రక్రియ ద్వారా జిల్లాలోని 12,522 మంది ఎన్నికల సిబ్బందిని నియోజకవర్గాలకు కేటాయించే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎన్నికల సాధారణ పరిశీలకులు హనిష్ చాబ్రా, సీతారాం జాట్ తదితరుల సమక్షంలో ఎన్ఐసి అధికారులు నిర్వహించారు. మహిళా ఉద్యోగులకు వారు పనిచేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనే వేరొక మండలంలో ఎన్నికల విధుల్లో నియమిస్తున్నామని, పురుష సిబ్బందికి ఇతర నియోజవర్గాల్లో ఎన్నికల విధుల్లో నియమిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు.

పిఒ, ఎపిఒలు 2087 మందిని, ఇతర పోలింగ్ సిబ్బంది 8,348మందిని కేటాయించినట్టు పేర్కొన్నారు. మూడో విడత రెండమైజేషన్ ప్రక్రియ మే 11వ తేదీన జరుగుతుంది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఎన్ఐసి అధికారులు నరేంద్ర, బాల సుబ్రహ్మణ్యం, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం లోక్‌సభ

ఎవరి వశం?

అభ్యర్థుల ఆశలన్నీ పార్టీపైనే

విజయనగరం ఎంపీ ఎవరి వశం? స్థానిక సిట్టింగ్ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు ప్రజలు మరోసారి పట్టం కడతారా?. లేక టిడిపి నుంచి రంగంలోకి దిగిన కలిశెట్టి అప్పలనాయుడుకు ఈసారి అవకాశం కల్పిస్తారా?. ఇండియా వేదిక తరపున పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బొబ్బిలి శ్రీను ప్రభావం ఎంత?. ఇది ప్రస్తుతం జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న చర్చ. కానీ, ఈ ముగ్గురు అభ్యర్థుల జయాపజయాలు, వారి వ్యక్తిగత చరిష్మాకన్నా పార్టీలపై ప్రజలు చూపే ఆదరాభిమానాలను బట్టి ఉంటాయని చర్చ జరుగుతోంది.

బెల్లాన చంద్రశేఖర్ (వైసిపి అభ్యర్థి)

కలిశెట్టి అప్పలనాయుడు (టిడిపి అభ్యర్థి)

బొబ్బిలి శ్రీను (కాంగ్రెస్ అభ్యర్థి)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర రాజకీయాలపై ఎక్కువ మంది ఆసక్తి చూపడం సర్వసాధారణం. కానీ, దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు మారుమూల ప్రాంతంలోని ప్రజానికాన్ని కూడా ప్రభావితం చేస్తుండడం, ఆ విషయాలు ఎప్పటికప్పుడే తేటతెల్లమౌతుండడంతో దేశ రాజకీయాలపైనా, అందుకు వేదికగావుండే లోక్ సభ అభ్యర్థుల గెలుపోటములపైన కూడా చర్చనడుస్తోంది. గత పదేళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, నిత్యవసర సరుకులు తదితర రూపాల్లో ప్రజలపై మోపిన భారాలు, విలువ ఆధారిత పన్ను, చెత్తపన్ను, జిఎస్‌టి వంటి రూపాల్లో ప్రజల నుంచి చేసిన భారీ వసూళ్లు సగటు పేద, మధ్యతరగతి ప్రజలతోపాటు ఎగువ మధ్యతరగతులను కూడా ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేశాయి. ఈ మేరకు మన జిల్లాలోనూ బోడికొండ, తామర కొండ, శిఖపరువు, గరివిడి, చీపురుపల్లి ప్రాంతాల్లో నిక్షిప్తమైవున్న గ్రానైట్, మాంగనీస్ గనులను కారు చౌకగా కట్టబెట్టి పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు భారీగా లాభాలు చేకూర్చేందుకు ప్రయత్నించారు. మరోవైపు రామతీర్థంలోని రాముని విగ్రహాన్ని ధ్వంసం ఎలా జరిగిందన్నది కాసేపు పక్కనబెడితే, ఆ ఘటనను మతం, రాజకీయాలకు ముడిపెట్టిన బిజెపి తీవ్ర (మిగతా..3లో)

నాగార్జునతో రాయబారం

మీసాల గీతతో చర్చిస్తున్న కిమిడి నాగార్జున

- నామినేషన్ ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి
- ససేమిరా అన్న గీత

ప్రజాశక్తి - విజయనగర ప్రతినిధి/కోట

చేతుల కాలాక ఆకులు పట్టుకోవడం అంటే బహుశా ఇదేనేమో. నామినేషన్ వేసేవరకు మీసాల గీత మాజీ ఎంఎల్ఎ అని, అంతకుముందు మున్సిపల్ ఛైర్మన్ గా పని చేశారని, ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేసినా నియోజకవర్గంలో ఎంతోకొంత ప్రభావం చూపుతారని ముందుగా గుర్తుకు రాలేదేమో టిడిపి నాయకులకు. నామినేషన్ వేసిన నాలుగు రోజుల తరువాత నుంచి గీత కోసం గిర గిరా తిరుగుతున్నారు. తాజాగా టిడిపి జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున శనివారం గీత ఇంటికి రాయవారానికి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు వైఖరితో చంద్రబాబు వ్యూహం బెడిసి కొట్టినట్లు ఈనెల 27 ప్రజాశక్తి లో రాజకీయ కథనం వెలువడిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునను గీత ఇంటికి పంపినట్టు సమాచారం. నామినేషన్ ఉపసంహరించు కోవాలంటూ అశోక్ విజ్ఞప్తి చేస్తున్నారని, తన మాటకూడా అదేనని గీతకు నాగార్జున చెప్పారట. ఈ ప్రతిపాదనను గీత సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. 'నాకు చీపురుపల్లి టిక్కెట్ ఇస్తామని ఆరు నెలల క్రితమే అధిష్టానం చెప్పింది. చివరిదశ చీపురుపల్లి అసెంబ్లీ లేదా విజయనగరం ఎంపి టిక్కెట్ లలో ఏదో ఒకటి తప్పకుండా ఇస్తామని చెప్పారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేసుకుని సిద్ధంగా ఉండాలని కూడా అధినేతలిద్దరూ హామీ ఇచ్చారు. తీరా జాబితా లో నా పేరు రెండు చోట్లా కనిపించలేదు. ఈ విషయమై నేను ఫీల్ కాలేదు' అని నాగార్జున చెప్పినట్లు తెలిసింది. అధినేత నిర్ణయాన్ని గౌరవించి, పార్టీకి సహకరించాలని కోరారు .
దీనికి గీత బదులిస్తూ మొన్నటివరకు తనను పట్టించుకోలేదని, స్థానికంగా చేస్తున్న కార్యక్రమాల విషయం లో కూడా ఎలాంటి సమాచారం అందడం లేదని, తనను నమ్ముకున్న నాయకులు, కార్యకర్త అభీష్టం మేరకు నామినేషన్ వేశానని, ఉపసంహరించుకోబోనని చెప్పినట్లు తెలిసింది. అధిష్టానం మాట తప్పి నంత సులువుగా నేను ఇచ్చిన మాట తప్పలేను అంటూ ఖరా ఖండిగా చెప్పినట్లు తెలిసింది. తాను ఆత్మ గౌరవానికే నిలబబడతానని అన్నట్లు (మిగతా..3లో)

వేదాంత జూనియర్ కాలేజ్
(R.C.No.440/E3-3/2000-01) College Code : 24061
IIT - NEET అకాడమి
చర్చివీధి, పార్వతీపురం - 535 501
ఆరంభం నుండి అదే సంచలనం !! వరుసగా మూడవసారి అదే ప్రభంజనం
1893 All India Rank
టి.సుజిత కుమార్ అప్లికేషన్ నెం. 240310377152
IIT - JEE 2024లో అపురూప ఘట్టాన్ని ఆవిష్కరించిన వేదాంత
కె.ధర్శిని అప్లికేషన్ నెం. 240310448439 91.10
వీరితో పాటు 2024 JEE అడ్వాన్స్‌డ్‌కి అర్హత సాధించిన విద్యార్థులు - ఆరుగురు
ONCE AGAIN EXTRORDINARY RESULTS by VEDANTHA IN
1917 All India Rank (OBC) P. HARIPRIYA DHARSHINI IIT-BHUBANESWAR COMPUTER SCIENCE & ENGINEERING
IIT - JEE ADVANCED - 2023
1910 All India Rank (EWS) T. SANDEEP IIT-ROPAR (PUNJAB) ELECTRICAL & ELECTRONICS ENGINEERING
IPE - 2024 ఫలితాలు
MPC 981/1000 కె.సుహార్శిని HNo.2403213626
MPC 68.26% BiPC 83% జిల్లా అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించినవిద్యాసంస్థ
BiPC TOWN 1st 977/1000 జి.నీలిమ
బాలబాలికలకు వేర్వేరు హాస్టల్ సౌకర్యం కలదు

ఓటుతో మద్దతివ్వండి : ఎమ్‌పి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రజా సంక్షేమానికి పని చేస్తున్న వైసిపికి ఓటుతో మద్దతు ఇవ్వాలని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ కోరారు. పట్టణంలోని మార్కెట్లో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం చేసిందన్నారు. అవినీతి రహిత పాలన అందించిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. కళింగ వైశ్య సంఘం భవనంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించి మద్దతు కోరారు. ఆయనతో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, కింతలి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

28వ వార్డులో ఎమ్మెల్యే శంబంగి ప్రచారం

పట్టణంలోని 28వ వార్డులో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించి ఓట్లను అభ్యర్థించారు. వైసిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో మాజీ మంత్రి పెద్దింటి జగన్మోహన్ రావు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కౌన్సిలర్లు పి.ఉమశంకర్, వనజకుమారి, సునీత, పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

బొబ్బిలి రూరల్: పక్కి గ్రామంలో శనివారం టిడిపిని వీడి వైసిపిలో 25 కుటుంబాలు చేరాయి. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే శంబంగి పనితీరు, ప్రభుత్వ పథకాలు నచ్చి వైసిపిలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారందరిని ఎమ్మెల్యే చిన అప్పలనాయుడు పార్టీలోకి ఆహ్వానించి కండువాలు వేశారు. పార్టీలో చేరిన వారిలో బోధల లక్ష్మి, శంబంగి ధనుంజయ నాయుడు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు తెంటు సీతంనాయుడు ఉన్నారు.

బొబ్బిలి: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి

సామాజిక న్యాయం వైసిపితోనే సాధ్యం: ఎమ్మెల్యే

బొండపల్లి: సామాజిక న్యాయం వైసిపితోనే సాధ్యమని, ఎమ్‌పి ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో టిడిపి కూటమి సామాజిక న్యాయం పాటించలేదని గజపతినగరం ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి బొత్స అప్పలనరసయ్య ఆరోపించారు. సామాజిక న్యాయం వైసిపితోనే సాధ్యమని ఈ మేరకు టికెట్లు కేటాయింపులో బిసిలకు అధిక ప్రదాన్యత వైసిపి ఇచ్చిందని బొత్స స్పష్టం చేశారు. శనివారం మండలంలోని గొట్లాం, ఒంపల్లి, వేంద్రాం, మరువాడ కొత్తవలస గ్రామాలలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబుతో కలసి ఎమ్మెల్యే బొత్స ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం పేదల ఆర్థిక అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పుట్టినరోజు సందర్భంగా గొట్లాంలో అభిమానులు, కార్యకర్తలు కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చల్ల చలం నాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశ రావు, నాయకులు బి.వి.ప్రభూజి, మీసాల సరోజినీ, గొండెల ఈశ్వరరావు, పిఎసియస్ అధ్యక్షులు మహంతి రమణ, మండలపార్టీ అధ్యక్షుడు బొద్దల చిన్నం నాయుడు, మాజీ ఎంపిపి బండారు బంగారం, ఈదిబిల్లి కృష్ణ, యువనాయకుడు బొత్స సాయి గురునాయుడు, మీసాల తులసీ రావు, సర్పంచ్‌లు ఎం,ఆదిలక్ష్మి, కర్రోతు శ్రీనివాసరావు, లండ నారాయణమ్మ పాల్గొన్నారు.

జగనన్నతోనే ప్రజా సంక్షేమం

డెంకాడ: ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, ఎమ్మెల్యే తనయుడు బడ్డుకొండ మణిదీప్ నాయుడు, ఎమ్‌పి చంద్రశేఖర్ తనయుడు బెల్లాన వంశీకృష్ణ అన్నారు. మండలంలోని పేడాడ, తమ్మాపురం, అమకాం పంచాయతీలలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా బడ్డుకొండను, ఎమ్‌పిగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, పేడాడ సర్పంచ్ గౌరీ, అమకాం సర్పంచ్ దిండి అప్పారావు, నాయకులు చిక్కాల జనార్దన్ రావు, గోపిరాజు, శంకర్, ఆనంద్, వినోద్, ధర్మ, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కోట: పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

మరోసారి గెలిపించండి:కడుబండి

శృంగవరపుకోట: వైసిపిని మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే కడు బండి శ్రీనివాసరావు కోరారు. శనివారం మండలంలోని ముసిడిపల్లి, కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో గల గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీను ఎమ్‌పిగా గెలిపించాలని కోరారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించే అవకాశం తమకు మరోసారి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, కొప్పల వెలమ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, మాజీ జెడ్‌పిటిసి సుకురు రామలక్ష్మి, వాకాడ రాంబాబు, సాంబరాజు, వైసిపి మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, స్థానిక సర్పంచ్ సులుబొంగు దారప్ప, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే బడ్డుకొండ ఎన్నికల ప్రచారం

భోగాపురం : మండలంలోని ఐదు పంచాయతీల్లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం ప్రచారం చేయనున్నారని వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. లింగాలవలస, మరడపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీ, చెరుకుపల్లి, గుడివాడ, రాజాపులోవ పంచాయతీల్లో ప్రచారం చేయనున్నారని అన్నారు. మండలంలోని నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు విజయగౌరి

వేసవి శిక్షణ తరగతులతో మేలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పదో తరగతి విద్యార్థులు కోసం నిర్వహిస్తున్న ఉచిత వేసవి తరగతులతో ఎంతో మేలు జరుగుతోందని, ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి కోరారు. స్థానిక వాసు జూనియర్ కళాశాలలో శనివారం గ్రీన్ బెల్ట్ సొసైటీ, యుటిఎఫ్, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు శిక్షణ తరగతులు దోహదం చేస్తాయన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి, యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, పి.సత్యనారాయణ, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం నాయకులు శర్మ, తదితరులు పాల్గొన్నారు.

చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో వాటర్ ప్యాకెట్లు అమ్మకాలపై నిషేధం ఉండడంతో వివిధ పనులు కోసం పట్టణానికి వస్తున్న ప్రజలు తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేసవిలో దాహన్ని తీర్చేందుకు చలి వేంద్రాలు ఏర్పాటుకు కౌన్సిల్ తీర్మానం చేసినప్పటికీ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు స్పందించి చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- బొబ్బిలి

రాజా కళాశాలలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ వీరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024లో బిఎస్‌సి కెమిస్ట్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూకు అర్హులన్నారు. అపర్ణ ఆర్గానిక్స్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు టెన్త్, ఇంటర్ సర్టిఫికేట్స్, ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో కళాశాలకు ఉదయం 10గంటలకు హాజరు కావాలని కోరారు.

కిమిడిని కలిసిన ఎమ్‌పి, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- రేగిడి

మాజీ జెడ్‌పిటిసి, టిడిపి సీనియర్ నాయకులు కిమిడి రామకృష్ణంనాయుడును విజయనగరం ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ శనివారం మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో కలిశారు. టిడిపి నుంచి వైసిపిలోకి రావాలని కోరారు. పార్టీ పరిస్థితులపై ముందుగా చర్చించుకున్నారు. వైసిపికి వస్తే అన్ని విధాలుగా గౌరవ ప్రతిష్ట ఉంటాయన్నారు. విజయం సాధించిన వెంటనే సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తన కార్యకర్తలతో చర్చించి భవిష్యత్తు ప్రణాళికను చెబుతానని ఆయన స్పష్టం చేశారు. వీరితోపాటు రేగిడి వైస్ ఎంపిపి అచ్చెంనాయుడు, జగన్ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని కొండతామరపల్లిలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఎన్ని బాబు, గాయత్రిలు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలకు ముందు నవధాన్యాలు ఎకరానికి 12 కేజీలు విత్తనాలను జల్లుకోవాలన్నారు దీని వల్ల నేల ఎల్లప్పుడూ సారవంతంగా ఉంటుందని నేలలో ఉండే సూక్ష్మజీవులు సమృద్ధిగా అభివృద్ధి చెంది మొక్కలకు సారవంతాన్ని అందిస్తాయని చెప్పారు. ఏటా రైతు తనకున్న విస్తీర్ణంలో నవధాన్యాలు సాగు చేయాలని అన్నారు. నవ ధాన్యాలు కిట్లను ఆర్‌బికెలో అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి రైతు వాటిని వినియోగించుకొని భూమి సారవంతాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి మేలు

ఎస్. కోట కాంగ్రెస్ అభ్యర్థి గేదెల

ప్రజాశక్తి - జామి

కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి మేలు అని ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకొని, ప్రత్యేక హోదా సాధించుకోవాలని ఎస్‌కోట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గేదెల తిరుపతిరావు పిలుపునిచ్చారు. శనివారం జామి దొండపర్తి జంక్షన్ నుంచి ప్రారంభించిన ఎన్నికల ప్రచారాన్ని ఎస్‌సి కాలనీ, బస్టాండ్, మాధవరాయ మెట్ట వరకూ నిర్వహించారు. అనంతరం ఉపాది హామీ పని ప్రదేశాల్లో పర్యటించి, కూలీలతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే, కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఒకటైన ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేస్తామన్నారు. ఇంటింటికీ వెళ్లి హస్తం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు డేగల అప్పలరాజు, శారదా, పాత్రుడు, జామి అధ్యక్షులు బోని అప్పారావుతో పాటు నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న గేదెల తిరుపతి

మే 16న బిసిజి టీకా

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మే 16 నుంచి నిర్వహించనున్న వయోజనుల బిసిజి టీకా కార్యక్రమాన్ని సిబ్బంది, ఆశా కార్యకర్తలు విజయవంతం చేయాలని వైద్యాధికారి డాక్టర్ సీతల్ వర్మ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పిహెచ్‌సి పరిధిలో గల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోజనుల బిసిజి టీకా కార్యక్రమాన్ని కేంద్రం ప్రభుత్వం 2025 నాటికి క్షయ వ్యాధి నిర్మూలిద్దాం అనే నినాదంతో చేస్తుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు తప్పక ఈ బిసిజి టీకా వేసుకొనేటట్లుగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్షయ రోగులకు, వారి కుటుంబ సభ్యులకు, మధుమేహవ్యాధి గ్రస్తులు, ధూమపానం చేసే వారికి, బిఎమ్‌ఐ 18 కేజీ కంటే తక్కువ ఉన్నవారు, 60సంవత్సరాల నిండిన వారికి బిసిజి టీకా తప్పనిసరిగా వేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, హెచ్‌ఐవి, కేన్సర్, అవయవ మార్పిడి చేసుకున్నవారు, 6 మాసాల్లో రక్తమార్పిడి చేసుకున్నవారు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు జ్వరం, దగ్గు, బరువు తగ్గడం వంటి లక్షణాలున్న వారు ఈ టీకా వేసుకోవద్దన్నారు. ప్రతీ సచివాలయ పరిధిలో ప్రతీ గ్రామంలో ఈ టీకా కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

'మాధవిని గెలిపించుకుందాం'

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి లోకం నాగమాధవమ్మని మనం గెలిపించుకోవాలని నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు కోరారు. శనివారం పసుపాం, కొల్లాయి వలస, ఎరుకొండ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్లాసు గుర్తుపై ఓటువేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని మాధవి కోరారు. కర్రోతు బంగారాజు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేసేందుకు మనం మాదవమ్మను గెలిపించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో మన ప్రాంతం ఎంతంగానో అభివృద్ధి చెందనుందన్నారు. సాయంత్రం పతివాడలో సినీనటుడు పృథ్వీరాజ్ ప్రచారం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షలు మహంతి శంకరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి మహంతి చిన్నంనాయుడు, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మునాయుడు, నాయకులు ఆకిరి ప్రసాదరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షలు జలపారి శివ, పతివాడ శ్రీను, పులపా మల్లేశ్వ రావు, నక్కాన రమణ, బాలా అప్పలరాజు, మహ ంతి శివ, నర్సన్న, కంది రమణ పాల్గొన్నారు.

పూసపాటిరేగ ప్రచారంలో పాల్గొన్న పృథ్వీరాజ్

వైసిపికి సహకరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- డెంకాడ

ప్రబోధ సేవా సమితి సభ్యులు వైసిపికి సహకరించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు కోరారు. మండలంలోని మోపాడ గ్రామంలో ఆయన స్వగృహంలో ప్రబోధ సమితి సభ్యులు తెచ్చిన త్రైత సిద్ధాంత భగవద్గీత కేలండర్లను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమితి సభ్యులందరూ స్వచ్ఛందంగా వైసిపి పార్టీకి మద్దతు తెలపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని రానున్న ఎన్నికల్లో వైసిపికి సహకరించి ఎమ్మెల్యే, ఎమ్‌పి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల, భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాలకు చెందిన సమితి సభ్యులు పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న పంజాబ్ సెంట్రల్ యూనివర్శిటీ విసి రాఘవేంద్ర పి.తివారి

ప్లాస్టిక్ వినియోగం మానవ మనుగడకే ప్రమాదం

గిరిజన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కట్టమణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వాతావరణ మార్పు రాబోయే కొద్దికాలంలో నీటి సంక్షోభాన్ని సష్టించవచ్చునని, భూమిపై ప్రజలమధ్య అంతర్గత యుద్ధాలు, సంఘర్షణలకు దారితీసి అవకాశం ఉందని గిరిజన యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టమణి తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం రోజు రోజుకు ఎక్కువ కావడం వల్ల పర్యావరణం చాలా విపత్కర పరిస్తుతులు ఎదుర్కోవలసివస్తుందని అన్నారు.ధరిత్రి దినోత్సవం సందర్భంగా శనివారం సిటియులో 'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్' అనే అంశంపై నిర్వహించిన సెమినార్ కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన పంజాబ్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాఘవేంద్ర పి.తివారి మాట్లాడారు. పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడటం వలన లిథోస్పియర్, హైడ్రోస్పియర్, అట్మాస్పియర్ నాణ్యత దెబ్బతింటుందని నేల, గాలి, నీటి నాణ్యతను కాపాడేందుకు భవిష్యత్ తరాలకు అందించేటందుకు ప్రజలు ప్రయత్నించాలని కోరారు. కాలుష్యం నివారణ, పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ కె.ప్రసాద్ మన్నాల, ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, డీన్ ప్రొఫెసర్ శరత్చంద్రబాబు, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.బి.కివడే, తతదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.

ఉపాధి వేతనదారులనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు మన్మథరావు

ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-బలిజిపేట

రానున్న ఎన్నికల్లో ఇండియా బ్లాక్ మద్దతుతో అరకు పార్లమెంటుకు సిపిఎం తరపున పోటీ చేస్తున్న పి.అప్పలనరసకు, పార్వతీపురం నియోజకవర్గానికి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న బత్తిన మోహనరావును గెలిపించాలని సిపిఎం నాయకులు వై.మన్మధరావు, గేదెల సత్యనారాయణ కోరారు. బలిజిపేటలోని ఉపాధి పనుల వద్ద ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత, గిరిజన,పేద, రైతు, కార్మిక ఉద్యోగుల సమస్యల కోసం నిరంతరం పోరాడే సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరం లోకసభ ఎవరి వశం?

(మొదటిపేజీ తరువాయి)

ఉద్రిక్త పరిస్థితుల వరకు తీసుకెళ్లిన సంగతి అందరికీ తెలిసిందే. ప్రశాంతతకు మారుపేరుగా ఉండే మన జిల్లాలో బిజెపి మత అజెండా ముందుకు సాగించడం సాధ్యం కాలేదు. విభజన హామీలు నెరవేర్చలేదు. ప్రత్యేక హోదా ఇవ్వలేదు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ కూడా ఆవిరైపోయింది. వెనుకబడిన ఉత్తరాంధ్రా జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు అరకొరతో ఆపేసింది. రాజధాని, పోలవరం వంటివాటికి సాయం అందజేయక పోవడంతోపాటు గ్రామ పంచాయతీలకు కూడా చట్ట ప్రకారం నిధులు కేటాయించలేదు. ఈనేపథ్యంలో ఇవన్నీ బిజెపితో నేరుగా పొత్తుపెట్టుకున్న టిడిపికి మాత్రమే కాదు. పరోక్షంగా బిజెపికి తొత్తులా వ్యవహరిస్తూ, ప్రత్యేక హోదా కోసం కనీసం నోరు మెదపని వైసిపికి కూడా ప్రతికూల అంశాలే. పైన పేర్కొన్న అంశాలపై ప్రజలకు పూర్తిగా అర్థమైతే. ఇటు వైసిపి, అటు టిడిపి ఎంపీ అభ్యర్థులకు ఎదురు దెబ్బ తప్పదు. ఆ మేరకు కాంగ్రెస్ అభ్యర్థికి ఓట్ల రూపంలో లాభం చేకూరుతుంది. వాడు కాకపోతే వీడు... వీడు కాకపోతే వాడు అన్నట్టుగా టిడిపి, వైసిపి అభ్యర్థులవైపే చూస్తే ఆయా పార్టీ అసెంబ్లీ అభ్యర్థులకు వచ్చే ఓట్లను బట్టి ఎంపీ అభ్యర్థుల భవిత్వం కూడా ఉండవచ్చని పలువురు విశ్లేషిస్తున్నారు. ముగ్గురు అభ్యర్థులూ ఇప్పటికే తమ ప్రచారాలను ముమ్మరం చేశారు. టిడిపి, వైసిపి అభ్యర్థులు వ్యక్తిగత ప్రచారం కంటే అసెంబ్లీ అభ్యర్థులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. ఎవరికి అవకాశం దక్కుతుందో వేచి చూడాల్సిందే.

సిజేరియన్లు ఎక్కువ చేస్తే కఠినచర్యలు

ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ రాణి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రైవేట్ హాస్పిటల్లో సిజేరియన్లు అధికంగా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇంఛార్జి అధికారి డాక్టర్ కె.రాణి తెలిపారు. శనివారం నాడు ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాలో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్‌లలో సిజేరియన్లు ప్రసవాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. సిజేరియన్లు అధికంగా చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రి ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. మే నెలలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుంది కాబట్టి ఆసుపత్రి యాజమాన్యాలు మాక్ డ్రిల్ నిర్వహించాలని తెలిపారు. ఎన్‌ఒసి విషయంలో ఆసుపత్రులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. షార్ట్ సర్క్యూట్ అవ్వకుండా ప్రతిరోజు చెక్ చేసుకోవాలని కోరారు.

అప్పులిచ్చి ఆస్తులు లాక్కొనే వ్యక్తి కోలగట్ల : కాళ్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అప్పులిచ్చి ఆస్తులు లాగేసుకున్న వ్యక్తి ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అని, ఆయనకు నీతి నిజాయితీ గురుంచి మాట్లాడే అర్హత లేదనిఅర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్ అన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయనగరంలో జరుగుతున్న అవినీతి, ఆక్రమణలు , కబ్జాల పాలన కోలగట్ల వీరభద్రస్వామిది అని అందరికీ తెలుసునన్నారు. అప్పులు తీసుకో ఆస్తులు సమర్పించుకో అనే ది ఆయన చరిత్ర అన్నారు. బండారు అప్పలరాజు దగ్గర వడ్డీ మీద వడ్డీ వేసుకొని 45 ఎకరాలు భూమి కాజేసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వెంకటపద్మ నర్సింగ్‌హోం యజమాని కష్ణమోహన్ ఆస్తి ఎమ్మెల్యే స్వాధీనం అయిపోయిందన్నారు. వెలిశెట్టి వెంకటస్వామి కోలగట్ల దగ్గర అప్పుతీసుకొని వెంకటలక్ష్మి సినిమా హాల్ లాగేసుకున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అప్పులు తీర్చడానికి అవకాశం ఇవ్వకుండా ఆస్తులు స్వాదీనం చేసుకున్నారనీ ఇది ఎమ్మెల్యే కోలగట్ల చరిత్ర అని విమర్శించారు. అలీబాబా 40 దొంగలు ఆయన అనుచరులని ఎద్దేవా చేశారు. రైల్వే ట్రాక్ కోసం జరిగిన భూ సేకరణలో మా సామాజిక వర్గానికి చెందిన వారిని కోలగట్ల అనుచరులు బెదిరించి డబ్బులు తీసుకున్నది వాస్తవం కాదా అని అన్నారు. ఇటువంటి దౌర్జన్యాలు చేసిన వ్యక్తిని మళ్లీ ఎన్నుకుంటే ప్రభుత్వ భూములేమీ మిగలవని అన్నారు. నిజాయితీ గల పూసపాటి అదితి గజపతి రాజును గెలిపించాలని కోరారు. విలేకర్ల సమావేశంలో మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఒడిశా వాసి మృతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్ వద్ద గుంటూరు-రాయగడ ఎక్స్ ప్రెస్ రైలు నుంచి జారి పడి ఒడిశా రాయగడకు చెందిన నాయుడు సాయిగౌతమ్(25) శనివారం మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న హెచ్‌సిరత్న కుమార్ ఆధార్ కార్డు ఆధారంగా మృతుని పేరు వివరాలు కనుక్కొని కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. అనంతరం ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కుక్కల దాడులతో ప్రజలు బెంబేలు

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

మండలంలోని రోజు రోజుకు కుక్కదాడులు ఎక్కువై ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఒంటరిగా ఇళ్లు దాటాలంటే భయమేస్తుందని వాపోతున్నారు. మూడు రోజుల క్రితం గంట లక్ష్మి అనే మహిళను తీవ్రంగా గాయపర్చి ఆసుపత్రి పాల్జేశాయి. శనివారం ఉదయం గవరంపేట పంచాయతీ వెంకటరాజుపురం గ్రామానికి చెందిన గొడబ సరోజిని (60) పొలంలోకి వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా ఆమెపై కుక్కలు దాడి చేశాయి. దీంతో స్థానికులు చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఏడాదిలో 428 మంది కుక్కల దాడులతో చికిత్స పొందారని వైద్యులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల దాడుల నుంచి ప్రజలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కెంగువలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని కెంగువ గ్రామంలో వైసిపి నాయకులు శనివారం ప్రచారం చేపట్టారు. ఉపాధి కూలీలు పనులు చేస్తున్న చెరువు వద్దకు వెళ్లి మాట్లాడారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, విద్య,వైద్యం సక్రమంగా అందాలన్నా మళ్లీ వైసిపిని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా బొత్స. అప్పలనరసయ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గార తవుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, మండల సురేష్, సామంతుల పైడిరాజు, లెంక.శ్రీనివాసరావు, మజ్జి రామకృష్ణ, గుడివాడ రామకృష్ణ, లెంక గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం పట్టణం 41వ డివిజన్ చెందిన పొట్నూరు ప్రసాద్, సయ్యద్ హాఫీజ్, మహమూద్, రెహ్మాన్, గొట్టిపాటి రాజుతో పాటు 50 కుటుంబాలు శనివారం నాడు అశోక్ బంగ్లాలో టిడిపిలో చేరాయి. టిడిపి అభ్యర్థి, నియోజకవర్గ ఇంచార్జ్ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి సమక్షంలో వీరంతా టిడిపి కండువా కప్పుకున్నారు.

CHANGE OF NAME DAUGHTER

I have change my name from **T.RISHIKA to TALLAPUDI RISHIKA** Prasently Residing Tallapudi peta Vill, Kondakarakam Post, Nellimarla Mandal, Vizianagaram Dist, State Andhra Pradesh. Aadhaar No: 5468 6445 2774 vide affidavit dated 26th April 2024, Date of the affidavit in my father Army records my name is mentined as **T.RISHIKA** instead of **TALLAPUDI RISHIKA** hence this forth my full name will be **TALLAPUDI RISHIKA** hence this paper advertisement in respect of my name change

- TALLAPUDI RISHIKA

ఇవిఎంలపై అవగాహన ఉండాలి

రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల నిర్వహణలో ఇవిఎంల నిర్వహణ, వినియోగం అత్యంత ప్రాధాన్యమని బొబ్బిలి నియోజక వర్గ రిటర్నింగ్ అధికారిణి సాయి శ్రీ అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎన్నికల విధులు నిర్వహించే బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లు, సెక్టార్ అధికారులకు పోల్ డే విధులు, ఇవిఎంలపై శిక్షణ ఇచ్చారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి త్రినాధ నాయుడు ఆధ్వర్యాన జరిగిన ఈ శిక్షణలో సాయి శ్రీ మాట్లాడుతూ ఇవిఎంల పని తీరు, వాటిని వినియోగించే పద్ధతులపై అన్ని స్థాయిల అధికారులు తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతం గా, పారదర్శకంగా ఎక్కడ ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలని కోరారు. మాస్టర్ ట్రైనీలు జెసి రాజు, సిహెచ్‌జె ప్రవీణ్, శంకర రావు ప్రసాదరావు, ప్రసన్న కుమార్, శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామభద్రపురం తహశీల్దార్ సులోచన , సురేష్ కుమార్, సూపర్ వైజర్లు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

నాగార్జునతో రాయబారం

(మొదటిపేజీ తరువాయి)

తెలిసింది. చిత్తశుద్ధి ఉంటే అశోక్ లేదా ఆయన కూతురు, ప్రస్తుత అభ్యర్థి గీత తో మాట్లాడే వారని, గీతపై పార్టీలో నిందలు వేసేందుకే తండ్రీ కూతురు కలిసి నాగార్జునతో రాయబారం నడిపారని గీతా అనుచరులు అంటున్నారు. అంతకు ముందు చంద్రబాబు సూచనమేరకు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపును కూడా గీత తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఈ నెల 29తో నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ ముగుస్తుంది. ఈలోపు అధిష్టానం గీతను ఒప్పించడానికి ప్రయత్నం చేస్తుందా? అసలు గీత మెత్తబడతారా? తగ్గేదే లేదంటూ ముందుకు సాగుతారా? మరో ఈ రెండు రోజుల్లో తేలనుంది.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

విజయనగరం టౌన్ : మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా చైతన్యవంతులు కావాలని నగరపాలక సంస్థ సిబ్బంది శనివారం ర్యాలీ చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నగరంలో రోజుకు ఐదు డివిజన్ల చెప్పిన అవగాహన ర్యాలీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన ర్యాలీలో సిటీ మిషన్ మేనేజర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో నగరంలో ఓటింగ్ శాతం పెరగాల్సిన ఆవశ్యకత ఉందన్న విషయాన్ని తెలియపరుస్తూ నినాదాలు చేశారు.

మహారాజశ్రీ బొబ్బిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

I.A.593/21, O.S. 260/2021

Between:
Smt. Dharmana Suneetha.....పిటిషనర్/వాది
Vs
Bonu Ganga Raju and 2 others
.......రెస్పాండెంట్లు/ప్రతివాది

D3 :- Chappa Nagaraju @ 43, S/o Suryanarayana, Door No. 8-60, Ammavari Colony, Gopalapuram, Rajam (Vill) & Panchayath, Srikakulam Dist.

జనరల్ నోటీసు - పత్రికా ప్రకటన

పై నెంబరు దావాలో D3 (మూడివ ప్రతివాది చప్ప నాగరాజుకు ఎన్నిసార్లు కోర్టు సమన్లు/నోటీసులు పంపించినా మీరు గైర్హాజరైయున్నారు. కావున శ్రీ కోర్టువారు మీకు ఫైనల్‌గా పత్రికా ప్రకటన ద్వారా నోటీసు జారీ చేసియున్నారు. **తే.02-05-2024దీ**న 3వ ప్రతివాది స్వయంగా గాని, వకీలు ద్వారాగాని **పగలు 10-30 గం॥** హాజరు కావలెను. మీకు ఉన్న ఆధారములతో, మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో అందుబాటులో ఉన్న సాక్ష్యాధారములతో మీ పరోక్షముంగా విచారణ చేసి తీర్మానం చేయబడును.

(కోర్టువారి ఆర్డరు ప్రకారం)

అమరాపు రామకృష్ణ
అడ్వకేట్, బొబ్బిలి,
సెల్ : 9491768409

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
ఆదివారం
28 ఏప్రిల్ 2024

గిరిజనుల పక్షాన పోరాడే వారిని గెలిపించండి

తాగునీటి సమస్యను సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి రమణకు వివరిస్తున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనులకు అండగా ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థిని, అరకు ఎంపి అభ్యర్థిని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కురుపాం అభ్యర్థి మండంగి రమణ కోరారు. మండలంలోని లోవముటా ప్రాంతమైన బాలేసు, బాలేసుగూడ గ్రామాల్లో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తనను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే గిరిజనుల సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గిరిజనులకు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేదని, ఐటిడిఎ ద్వారా రావాల్సి రుణాలు ఇవ్వడం లేదని, గిరిజనుల అభివృద్ధికి వస్తున్న నిధులు పక్కదారి పట్టిస్తున్నారని, ముఖ్యంగా చదువుకున్న గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి లేదని గిరిజనులకు వివరించారు. తనను, అరకు పార్లమెంటు స్థానానికి ఎంపిగా పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి పి.అప్పలనరసను చట్ట సభలకు పంపించినాడే పోరాడే సాధించుకోవచ్చు అని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మండంగి శ్రీనివాసరావు, పువ్వల తిరుపతిరావు, కోరాడ ఈశ్వరరావు, పాండు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల ఆవేదన

బాలేసుగూడలో తీవ్ర నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు సిపిఎం నాయకుల వద్ద మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు గ్రామంలోని బావిని పరిశీలించారు. ప్రతి ఏటా వేసవిలో నీటి సమస్య జటిలమవుతుందని తెలిపారు. ఉన్న ఒక్క బావి కూడా అడుగంటిపోవడంతో తాగడానికి నీళ్ల కరువుతున్నాయని విన్నవించుకున్నారు. నీటి సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు.

సిపిఎం అభ్యర్థి మండంగి రమణ

నెల్లికెక్కువ, వనకాబడిలో ఎన్నికల ప్రచారం

మండలంలోని నెల్లికెక్కువ, వనకాబడి పంచాయతీల్లో సిపిఎం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి గిరిజనుల సమస్యలను, బాధలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులకు అండగా ఉండే ఎర్రజెండా నీడలో నిరంతరం పోరాటాలు చేసే ఇండియా కూటమి మద్దతుతో కురుపాం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మండంగి రమణ, అరకు పార్లమెంటు సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న అప్పనర్సను గెలిపించాలని కోరారు.

కొమరాడ : మన రాష్ట్రానికి ద్రోహం చేసే బిజెపి దాని మిత్ర పక్షాలతో పాటు, మద్దతిస్తున్న వైసిపిని చిత్తుగా ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాకాడ ఇందిరా, నాయకులు ఎ.జగన్మోహన్, కె.సాంబమూర్తి అన్నారు. శనివారం కునేరు సంతలో సిపిఎం ఆధ్వర్యాన ఎర్రజెండా తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే రమణను, ఎంపీ అభ్యర్థిఅప్పల నర్సనను గెలిపించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమీప పామాయిల్ తోట వద్ద నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. సిపిఎం అభ్యర్థులను గెలిపించి అసెంబ్లీ, పార్లమెంట్‌కు పంపితే ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి, రామారావు లక్ష్మ, శివునినాయుడు ప్రసాద్ సురేష్ గోపాలం మధు పాల్గొన్నారు.

'కోళ్ల' ఎన్నికల ప్రచారం

ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో వావిలపాడు పంచాయతీ పరిధిలో కడకొండ, వీలుపర్తి పంచాయతీ పరిధిలో చామలాదేవి అగ్రహారం, దుంగాడ, రాయుడుపేట అగ్రహారం, వేపాడ పంచాయతీ పరిధిలో బక్కునాయుడుపేట గ్రామాలలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి ఎన్నికల ప్రచారం ర్వహించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఆలోచించి ఎమ్మెల్యేగా కోళ్ల లలితకుమారి, ఎంపిగా శ్రీభరత్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కోళ్ల మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి అభ్యర్థి శ్రీభరత్ పెద్దమ్మ బైరిపినేని శ్రీనాగి, టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి. భారతి, టిడిపి మండల ఉపాధ్యక్షులు పోతల.రమణ, మండల పార్టీ కార్యదర్శి కొట్యాడ రమణ, మూర్తి, బిజెపి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లిలో టిడిపి ఇంటింట ప్రచారం

నల్లబెల్లి గ్రామంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత యఋమారి, ఎమ్‌పి అభ్యర్థి ఎం. శ్రీ భరత్‌ను గెలిపించాలని కోరుతూ మండల ఎవేర్నెస్ మహిళా కమిటీ ఛైర్‌పర్సన్ గొంప తులసి శనివారం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి సెల్ నెంబర్ దాసరి లక్ష్మి, కోళ్ల ఉషాశ్రీ, బోజింకి మహేష్, జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడు గోకాడ మహేష్, డి.మంగునాయుడు, శీరంరెడ్డి దేముడునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిరా చుక్క చెరిగిపోదులే!



ప్రజాశక్తి-విజయనగరంకోట

ఓటేసినందుకు గుర్తుగా ఎడమ చేతి చూపుడు వేలికి అంటించే సిరా చుక్క బాధ్యతకు, గర్వ కారణానికి చిహ్నం. ఓటర్లు ఒకటికి మించి రెండు, మూడు సార్లు ఓటు వేయకుండా కూడా గుర్తించేందుకు వీలుంటుంది. ఈ సిరా చుక్క రెండు నుంచి నాలుగు రోజుల వరకు ఉండేలా తయారు చేస్తారు. దీని తయారీలో పదికి పైగా రసాయనాలు వాడుతుంటారు. ఆ చుక్క ఎక్కువ రోజులు చెరిగిపోకుండా ఉండేందుకు సిల్వర్ నైట్రేట్‌ను వాడుతుంటారు. వెలుతురు పడగానే ఇది వేలిపై ముద్రలా పడుతుంది. ఈ ఇంకు తయారీకి సిల్వర్ నైట్రేట్‌ను 10-18 శాతం వరకు వాడుతారు. ఇటీవల జరిగిన పరిశోధనల్లో సంప్రదాయ ముదురు నీలిరంగు స్థానంలో నారింజ సహా, ఇతర రంగులూ వస్తున్నాయి. ఇంకు స్థానంలో మార్కర్ కూడా వచ్చింది. ఈ సిరా చుక్కను దేశంలోని కర్నాటకలోని మైసూర్ పెయింట్స్, వార్నిష్ లిమిటెడ్, హైదరాబాద్‌లోని రాయుడు లేబోరేటరీస్‌లో మాత్రమే తయారు చేస్తారు. దేశంలో ఎంపివిఎల్ సిరా వాడుతుంటే ప్రపంచంలోని వంద దేశాలకు ఆర్ఎల్ సిరా వెళ్తోంది. సిరా స్థానంలో తొలిసారి ఈ సంస్థే మార్కర్‌ను కూడా తెచ్చింది. ఈ ఎన్నికల్లో మార్కర్‌ను వాడే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

విజయనగరం.. ఉపాధి రహిత కేంద్రం

- జ్యూట్‌మిల్లుల మూతతో వలసలు
- పారిశ్రామికంగా వెనుకబాటు
- శివారు కాలనీల్లో మౌలిక వసతులు కరువు
- పనుల కోసం కూలీల ఎదురు చూపులు
- ఉద్యోగ అవకాశాలు లేక యువత ఆవేదన

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో నగరంతో పాటు చుట్టుపక్కల ఉన్న 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సెలక్షన్ గ్రేడ్ మున్సిపాల్టీగా ఉన్న విజయనగరాన్ని 2016లో నగరపాలక సంస్థగా మార్పు చేశారు. అనంతరం 2017లో చుట్టుపక్కలున్న అయ్యన్నపేట, జమ్ము నారాయణ పురం, ధర్మపురి.గాజులురేగ, కెఎల్ పురంను నగరంలో విలీనం చేశారు. అయితే విలీనం చేసిన గ్రామాల్లో అభివద్ధి పనులు చేపట్టకపోగా పన్నుల భారం పెరిగి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యలు తిష్ట

నగరంలో అనేక సమస్యలు ఏళ్ల తరబడి తిష్ట వేశాయి. ముఖ్యంగా నగరంలోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో ఇటు పాలకులు, అటు అధికారులు విఫలమయ్యారు. ఇరుకైన రోడ్లు, అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థతోపాటు రోడ్లపై ఆక్రమణలు ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం. ఇరుకైన రోడ్లు నగరంలో ఎక్కడ చూసినా కనిపిస్తాయి. కొద్దిపాటి వర్షం వస్తే నగరంలోని రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, రైతుబజార్లు మొత్తం జలమయం కావడంతో నగర ప్రజలు ప్రతి వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు.

అభివృద్ధికి నోచని గురజాడ కాలనీ

విలీన గ్రామాల్లో సౌకర్యాలు నిల్

విలీన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. స్వచ్ఛమైన తాగునీరు లేక ఆయా గ్రామాల ప్రజలు రోజూ డబ్బు చెల్లించి టిన్నులు కొనుక్కోవాల్సి వస్తోంది. నీటి సరఫరా చేస్తామని చెప్పిన పాలకులు తాగునీటి నీ సరఫరా చేయడంలో విఫలమయ్యారు. పంచాయతీలుగా ఉన్నప్పుడు వేసిన బోర్లు నుంచి వచ్చిన నీరు, నగరపాలక సంస్థ అప్పుడప్పుడు పంపించే వాటర్ ట్యాంక్‌లే ఆధారంగా జీవిస్తున్నారు. పట్టణ శివారు కాలనీల్లో కూడా అదే పరిస్థితి నెలకొంది.

వర్షం వస్తే ముంపే

విజయనగరం జిల్లా కేంద్రం చారిత్రక పట్టణం. నేడు నగరంగా రూపాంతరం చెందినా అందుకు తగ్గ మౌలిక వసతులకు ప్రజలు నోచుకోవడం లేదు. శివారు కాలనీల్లో నేటికీ రోడ్లు,కాలువలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు లేవు. ఉపాధి కల్పించే ప్రధానమైన జ్యూట్ మిల్లులు ఏనాడో మూతపడగా, వాటిలో పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోసం వలసపోయిన వారు కొందరైతే.. చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారుర మరికొందరు.. పనులు లేక అల్లాడిపోతున్న ఇంకొందరు ఉన్నారు. పాలకులు ఎందరు మారినా ప్రజలు బాధలు పట్టడం లేదు. 1952లో ఏర్పడిన విజయనగరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 16సార్లు ఎన్నికలు జరిగాయి. ఇంత వరకు 9 మంది ఎమ్మెల్యేలుగా చేశారు. వీరిలో 7సార్లు, మూడు సార్లు, రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసిన వారు ఉన్నారు. అందులో రాష్ట్ర మంత్రులుగా, కేంద్ర మంత్రిగా పదవులు చేపట్టారు. కానీ నగరంలో ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అభివృద్ధిలో వెనుకబడి ఉంది. జిల్లా కేంద్రమైన విజయనగరంలో ప్రజలకు సౌకర్యాలు ఆ స్థాయిలో అందించడంలో పాలకులు విఫలమయ్యారు.

నగరానికి వరద ముంపు సర్వసాధారణం అయిపోయింది. కారణం కాలువ వ్యవస్థ పురాతనమైనది కావడం, ఆక్రమణలు ఇందుకు కారణం. నగరంలో ప్రధాన రహదారులు

విజయనగరం నగరం

ఆక్రమణలకు గురై 80 మీటర్ల రహదారులు నేడు 60 మీటర్లకు తగ్గిపోయాయి. గంటస్తంభం ప్రాంతం, ఎమ్‌జి రోడ్డులో ఉన్న ఆక్రమించిన వారికి వేరేచోట ప్రత్యామ్నాయ స్థలాలు చూపించడంలో పాలకులు విఫలమయ్యారు. నగరంలో పెద్ద కాలువలు లేవు,100 ఏళ్ల క్రితం కాలువలే నేటికీ ఉండటం వల్ల వరదలు వచ్చిన ప్రతిసారీ కార్పొరేషన్ కార్యాలయం ప్రాంతంలో , మార్కెట్ ప్రాంతాలు జలమయమవుతున్నాయి.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్రతిపాదనకే పరిమితం

నగరంలో పురాతన కాలువ వ్యవస్థ ఉండటం వలన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తామని చెప్పిన నేతలు ఇంతవరకూ దాన్ని ఆచరణలో పెట్టలేదు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం సంగతెలా ఉన్నా ఉన్న డ్రెయినేజీలు సైతం మురుగునీరు పారక దుర్గంధం వెదజల్లుతూ వర్షాకాలం వస్తే ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారు. రూ.150 కోట్లతో అండర్ గ్రౌండ్ కాలువ వ్యవస్థ నిర్మాణం చేయాలని 15 ఏళ్ల కిందట ప్రతిపాదనలు చేసినా నేటికీ అమలు నోచుకోవడం లేదు.

రోడ్డున పడ్డ జ్యూట్ కార్మికులు

జిల్లా కేంద్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పాలకులు ఎటువంటి కృషి చేయలేదు. వందేళ్లుగా ఉన్న జ్యూట్ మిల్లులు మూతపడడం, మరో ఇండస్ట్రీ లేకపోవడంతో ఉపాధి కోసం ప్రజలు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. అయితే పదేళ్ల కిందట నగరంలో ఉన్న అరుణా, ఈస్టుకోస్టు జ్యూట్ పరిశ్రమలు మూతపడటంతో సుమారు 10 వేల మంది కార్మికులు, కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కార్మిక సంఘాల నాయకులు ఎంత పోరాడినా మిల్లు తెరవకపోవడంతో ఉపాధి కోసం కార్మికులు పెయింటర్లుగాను, తోపుడు బండ్లపై కూరగాయలు అమ్ముకుంటూ, తాపీ పనులు చేసుకుంటూ, షాపుల్లో పనిచేస్తూ, కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. ఉపాధి కల్పనలో టిడిపి ప్రభుత్వం గాని, వైసిపి ప్రభుత్వం గాని పట్టించుకోలేదు.

సర్వజన ఆసుపత్రే దిక్కు

నగరంలో అర్బన్ హెల్త్ కేంద్రాలు 15 వరకు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇటీవల ఏడు మంజూరైనా వాటిలో మూడు మాత్రమే మాత్రమే ప్రారంభం అయ్యాయి తప్ప సేవలు అందడం లేదు.

పేరుకే డిగ్రీ కళాశాల

నగరంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కనీస వసతులు లేకపోగా డిగ్రీ కాలేజీకి కనీసం సొంత భవనాలు లేకపోవడం సిగ్గుచేటు అని పలువురు విమర్శిస్తున్నారు. నగరంలో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి సొంత భవనాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. విద్యార్థి సంఘాలు అనేక పోరాటాలు, ఆందోళనలు చేసినా, వినతిపత్రాలిచ్చినా సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ హై స్కూళ్లు ఏర్పాటు చెయ్యలేదు. మూడున్నర లక్షల జనాభా కలిగిన నగరంలో ఒకే ఒక్క జూనియర్ కళాశాల ఉండటం వలన మున్సిపల్ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకుని బయటకొచ్చిన పేద విద్యార్థులు లక్షల రూపాయలు వెచ్చించి ప్రయివేటు కాలేజీలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

సిబ్బంది లేక వైద్య సౌకర్యాలు సక్రమంగా అందకపోవడం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

ఈ రకంగా నియోజకవర్గంలో అనేక సమస్యలు ఏళ్ల తరబడి ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారు. మే 13వ తేదీన మరోసారి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రానున్న పాలకులైనా ప్రజా సమస్యలపై దృష్టిపెట్టి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

భవన నిర్మాణ పనుల కోసం కోట వద్ద వేచి ఉన్న కూలీలు

ఈస్టుకోస్ట్ జ్యూట్ మిల్లు స్థలంలో లేఅవుట్ వేసి అడ్డంగా పెట్టిన రేకులు

'సూపర్ సిక్స్'తో మేలు

ఎన్నికల ప్రచారంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన

ప్రజాశక్తి-బాడంగి, బొబ్బిలి

సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజల ఆర్థిక, జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని, అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందని టిడిపి అభ్యర్థి బేబీ నాయన అన్నారు. శనివారం మండలంలో ఎరుకల పాకాల, లక్ష్మి పురం, డొంకినవలస, తెంటువలస గ్రామాల్లో, బొబ్బిలి పట్టణంలో మూడో వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగన్ మోహన్ రెడ్డి మేనిఫెస్టోతో పేద ప్రజలకు మేలు జరగదని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్ముము నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, నాయకులు పాలవలస గౌరు, సర్పంచ్ పార్వతి, జనసేన నాయకులు గిరడ అప్పలస్వామి, కౌన్సిలర్ బి.సురేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలో టిడిపి నుంచి ప్రజల మద్దతుతో అద్భుతమైన విజయం సాధించే తొలి అసెంబ్లీ నియోజకవర్గం బొబ్బిలి అవుతుందని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. బేబినాయనని బాబ్జీ కలిసి లోక్ సత్తా పార్టీ తరపున సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఆయన వెంట జిల్లా పౌర వేదిక అధ్యక్ష కార్యదర్శులు జలంత్రి రామచంద్రరాజు, పిడకల ప్రభాకరరావు ఉన్నారు.

బాడంగి.. ఎన్నికల ప్రచారం చేస్తున్న బేబినాయన

బేబినాయన విజయం సాధించాలని పాదయాత్ర

బొబ్బిలి :టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్ది బేబినాయన విజయం సాదించాలని కోరుతూ శనివారం గొల్లపల్లి గ్రామానికి చెందిన లోచర్ల కుమార్, లోచర్ల పవన్ గొల్లపల్లి శ్రీదాడితల్లి ఆలయం నుంచి సింహాచలం సింహాద్రి అప్పన్న ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. కోటలో బేబినాయనను వారిద్దరూ కలిసి శ్రీదాడితల్లి ఆలయం వద్ద పూజలు చేసి పాదయాత్ర ప్రారంభించారు.

వేపాడలో వైసిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ మండల కేంద్రంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావును, ఎమ్‌పి అభ్యర్థి బొత్స ఝాన్సీలను గెలిపించాలని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం శనివారం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్‌పర్సన్ మూకల కస్తూరి, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ శ్రీను, సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, అరిగిపాలెం ఎంపిటిసి రమణ సర్పంచ్ అర్జునమ్మ, గంగతల్లి, శ్రీను, భాస్కర్‌రావు, ముత్యాల నాయుడు, చంద్రరావు, అప్పారావు, శ్రీను, సత్తిబాబు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సరసనాపల్లి, జోడుబందల, కందిశ, డోలపేట, తునివాడ, వెంకంపేట, మీసాల డోలపేట, చెలికానివలస, నాయరాలవలస, రంగరాయపురం, రెడ్డిపేట, లచ్చారాయపురం తదితర గ్రామాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోండ్రు మాట్లాడుతూ తనను ఆదరించి అసెంబ్లీకి పంపిస్తే రాజాం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం టిడిపిలో 50 కుటుంబాలు ఆయన సమక్షంలో చేరాయి. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, కిమిడి నరేంద్రనాయుడు, మహేశ్వర రావు, పైల వినయ్ కుమార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారంలో మాట్లాడుతున్న కోండ్రు మురళీ

వంగర : రాజాం నియోజకవర్గ అభివృద్ధి టిడిపి మాజీ మంత్రి కోండ్రు మురళీతోనే సాధ్యమని అతన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు మజ్జి గణపతి అన్నారు. ఈ మేరకు మండలంలోని కొప్పరవలసలో ఊట చెరువు వద్ద ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతన దారుల వద్దకు, రచ్చబండ వద్దకు వెళ్లి కోండ్రు మురళీకి మద్దతుగా శనివారం ప్రచారం నిర్వహించారు. అనంతరం బంగారు వలస ఎస్‌సి కాలనీలో ఇంటింటా కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోండ్రు మురళీమోహన్ మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో రోడ్లు, ఆసుపత్రులు, తాగునీరు, విద్యకు సంబంధించి ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బలగ సాయి, కె బుజ్జి, యం. ఉదయ రామ్, యలగాడ సింహాచలం, పరసయ్య, చిన్న తదితరులు పాల్గొన్నారు.

గడివలసలో ప్రచారం చేస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ పద్మావతి

గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - సాలూరు

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే డిప్యూటీ సీఎం రాజన్నదొరను మరోసారి గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి కోరారు. మండలంలోని కరాసువలస, మరలవలస, గడివలస గ్రామాల్లో శనివారం ఆమె ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అవగాహన వున్న నాయకుడు రాజన్నదొర అని అన్నారు. వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలంటే రాజన్నదొరను మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ కళ్లేపల్లి త్రినాధ్ నాయుడు, స్థానిక నాయకులు అధికారి నాయుడు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి

ప్రజాశక్తి - కొమరాడ

ఏజెన్సీ ప్రాంతాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని పార్వతీపురం రూరల్ సిఐ రవికుమార్ అన్నారు. శనివారం కుంతేసు, పూడేసు, యాండభద్ర, పేదశేఖ మారుమూల గిరిజన గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న పరిస్థితులను ఉన్నతాధికారులకు తెలియజేసేందుకు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. వచ్చేనెల 13న పోలింగ్ జరుగుతుందని, ముందస్తుగా పోలింగ్ కేంద్రాలకు వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు . ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రశాంతమైన పోలింగ్ జరిగేలా గిరిజన ప్రజలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో కొమరాడ ఎస్సై కె.నీలకంఠం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలసకు చెందిన వైసిపి రెబల్ సర్పంచ్ కుమిలి పాపమ్మ, ప్రతినిధి కుమిలి లక్ష్మణ్, పదిమంది వార్డు మెంబర్లు, ఎంపిటిసి సభ్యులు జి.విశాలాక్షితో పాటు దాదాపుగా 400 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వీరికి జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటు బిసి సెల్ కన్వీనర్ పి.కృష్ణమూర్తి నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జనసేన జిల్లా కార్యదర్శి బిపి నాయుడు, సంయుక్త జిల్లా కార్యదర్శి జనసేన జానీ, మాజీ జడ్పిటిసి గేదెల రమేష్ బాబు, ఎం.పుండరికం, రౌతు గోపి, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో జయకృష్ణ ప్రచారం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గదభవలస, కొత్తవలస, దేవగిరి, పెద్ద వంగర, గజిలి, కడగండి, ఒండ్రుజోలలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన నియోజకవర్గంలో గిరిజనులకు ఎక్కువ మేలు జరిగిందా? పెత్తందారులకు లబ్ధి జరిగిందా? గిరిజన ప్రజలే గుర్తు చేసుకోవాలని ఈ సందర్భంగా గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో సీతంపేట మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, సీనియర్ నాయకులు నిమ్మక నాగేశ్వరరావు, నిమ్మక చంద్రశేఖర్, ప్రచారకర్త తోయిక సంధ్యారాణి, నిమ్మక మురళి, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

కొత్తవలసలో ప్రచారం చేస్తున్న జనసేన అభ్యర్థి జయకృష్ణ

ఇన్‌ఛార్జికే విలువ లేదా?

- జనసేన అభ్యర్థికి మేమెలా మద్దతిస్తాం
- చల్లారని అసమ్మతి సెగ

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ నియోజకవర్గంలో ఎన్‌డిఎ కూటమి తరపున పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ గతంలో టిడిపిలో ఉన్నప్పటి నుంచి ఒక గ్రూపును కలుపుకొని పోలేదని ఆయనపై అసమ్మతి సెగ నేటికీ చల్లారలేదనే చెప్పవచ్చు. పొత్తుల్లో భాగంగా పాలకొండ టికెట్ జనసేనకు కేటాయించడంతో టిడిపి నుంచి ఇన్‌ఛార్జిగా ఉన్న జయకృష్ణ జనసేనలో చేరి టికెట్ సంపాదించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పడాల భూదేవికి ఇటీవలే పార్టీ అధిష్టానం బాధ్యతలు అప్పజెప్పింది. శనివారం సిఎల్ నాయుడు కళ్యాణమండపంలో పార్టీ సమావేశానికి హాజరు కావాలని భూదేవి ఆహ్వానం పలికినప్పటికీ పాలకొండ మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు తప్ప, మిగిలిన మండలాల అధ్యక్షులతో పాటు జయకృష్ణ టిడిపిలో ఉన్నప్పటి నుంచి మద్దతు తెలుపుతున్న నాయకులెవరూ హాజరు కాలేదని తెలుస్తోంది. దీంతో పాలకొండ, సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాలకు చెందిన నేతలు అరకు పార్లమెంట్ ఇన్‌ఛార్జి కిడారి శ్రావణ్ ముందు తమ బాధ ఏకరవు పెట్టారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నియమించిన ఇన్‌ఛార్జికి వ్యతిరేకించిన వ్యక్తులతో తాము ఎలా పని చేస్తామని జనసేన అభ్యర్థి అయితే టిడిపి నాయకులతో సమన్వయం చేయాల్సిన అవసరం లేదా అని నాయకులు ప్రశ్నించినట్లు తెలిసింది. జనసేన టికెట్ వచ్చి 15 రోజులు కావస్తున్నా ఇంతవరకు తమను ఎవర్నీ కలవలేదని, ఇలాంటి సందర్భంలో తాము ఎలా జయకృష్ణకు మద్దతుగా పని చేస్తామని ఇన్‌ఛార్జిని ప్రశ్నించినట్లు సమాచారం.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

కాలానుగుణంగా (సీజనల్) ప్రబలే ఆరోగ్య సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు సూచించారు. ఈ మేరకు మండలంలోని ఎస్ఆర్ పేటలో శనివారం ఆకస్మికంగా పర్యటించారు. జ్వర లక్షణాలతో గ్రామంలో ఎవరైనా ఉన్నారా అని, ఫీవర్ సర్వలెన్స్ చేపడుతున్నారా అని సిబ్బందిని ఆరా తీశారు. వేసవిలో తలెత్తే ఆరోగ్య సమస్యపై అక్కడి ప్రజలకు ఆయన అవగాహన కల్పిస్తూ బయట ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున శరీరంలో నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్, వడదెబ్బ, జ్వరాలు తదితర సమస్యలకు గురవుకాకుండా నీరు, మజ్జిగ, నిమ్మరసం, ఒఆర్ఎస్ మొదలగు ద్రావణాలు తరచుగా తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య పరిశీలన చేసి రికార్డులు తనిఖీ చేసి పిల్లల బరువు,ఎత్తు వివరాలు స్పష్టంగా ఉండాలన్నారు.పిల్లలకు నీరు,గ్లూకోజ్ ద్రావణం తాగిస్తూ ఉండాలన్నారు. అనంతరం హెల్త్ వెల్నెస్ కేంద్రంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం తనిఖీ చేశారు. ఒపి వివరాలు, ఆరోగ్య సమస్యలు అందజేసిన చికిత్స రికార్డులను పరిశీలించారు. 104 వాహనంలో మందులు, ఇసిజి పరికరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్.సంతోష్, ఇఒ సత్తిబాబు, పిహెచ్ఎన్ రవణమ్మ, వైద్య సిబ్బంది ఇంద్రాణి, రవణమ్మ, రమేష్, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, శివ, ఆశా కార్యకర్త తదితరులు ఉన్నారు.

కంకర తవ్వకాలకు అనుమతులేవి?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి వద్ద ఎటువంటి అనుమతులూ లేకుండా కొంత మంది కంకర తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోకపోవంతో అక్రమార్కుల ఆగడాలకు అంతులేకుండా పోయింది. రాత్రి, పగలు తేడా లేకుండా వారికి అవసరం వచ్చినప్పుడు చెరువుల్లో కంకర తవ్వకుని సొమ్ము చేసుకుంటున్నారు. పేదలకు అవసరమొచ్చి కంకర తవ్వితే చర్యలు తీసుకుంటున్న అధికారులు అధికార పార్టీకి చెందిన వారు ఇష్టానుసారంగా తవ్వేస్తే ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అనుమతులు లేకుండా కంకర, ఇసుక తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరతున్నారు.

తీరంలో 'అల'జడి

- ముక్కాం వద్ద అలల తాకిడికి కొట్టుకుపోతున్న సముద్ర తీరం
- రక్షణగోడ లేక ఇబ్బంది పడుతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని తీరప్రాంతమైన ముక్కాం గ్రామంలో సముద్ర తీరం అలలతాకిడికి కొట్టుకుపోతుంది. ఈ గ్రామం తీరానికి ఆనుకొని ఉండడంతో ఇళ్ళకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అయినప్పటికి రక్షణ గోడ నిర్మించలేదు. రక్షణ గోడ నిర్మిస్తారని గత కొన్నేళ్ల నుంచి గ్రామస్తులు ఎదురు చూస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో బితుకు బితుకు మంటూ మత్స్యకారులు జీవిస్తున్నారు.

ముక్కాం సముద్ర తీరానికి దగ్గర్లో ఉంటుంది. ఎప్పుడైన తుఫానులు వస్తే ఈ గ్రామం పైనే అధికారులు ఎక్కువగా దృష్టి సారిస్తుంటారు. సముద్రం ఆటుపోట్లుకు గురైనప్పుడు అలల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీంతో సముద్ర తీరం కోతకు గురవు తుంది. ఇటీవలి తుఫాన్లతో పాటు అలల తాకడికి సముద్ర తీరం ఎన్నడూ లేని విధంగా కొట్టుకుపోయింది. తీరానికి ఆనుకొని ఉన్న సిమెంటు రహదారితో పాటు మత్స్యకారులు వలలు దాచుకునే పాకలు సైతం కొట్టుకుపోయాయి. ఇళ్లు కూడా కూలిపోయే పరిస్థితికి వచ్చింది.

రక్షణ గోడ కట్టకపోతే గ్రామానికే ప్రమాదం

ఈ గ్రామం సముద్రానికి దగ్గరగా ఉండడంతో ప్రమాదం ఉంది. అందుకు తప్పనిసరిగా రక్షణ గోడ నిర్మించాల్సిన అవసరం ఉంది. కాని ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోవడం లేదు. గతంలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న సమయంలో బొత్స ఝాన్సిలక్ష్మి రక్షణ గోడ నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కాని ఇంత వరకు కనీసం అంచనాలు కూడా తయారు చేయలేదు. గతంలో పోటీ చేసిన నాయకులంతా రక్షణ గోడ నిర్మాణానికి హామీలిచ్చారు తప్ప అమలు పరచలేదు. గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు రక్షణ గోడ నిర్మిస్తామని మత్స్యకారులను నమ్మబలికి నట్టేట ముంచేశారు. తప్ప ఏ ఒక్కరూ రక్షణ గోడపై దృష్టి పెట్టలేదు. ఇక్కడ తీరం కోతకు గురి కాకుండా ఉండాలంటే తప్పనిసరిగా రక్షణగోడ నిర్మించాలని మత్స్యకారులు కోరుతున్నారు. కాని తుఫాన్లు సమయంలో అధికారులు ఇక్కడ హడావుడి చేసి తీరానికి ఆనుకొని ఉన్న ఇళ్ళను ఖాళీ చేయాలని ఆదేశిస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేయడం లేదు.

రక్షణ గోడ లేక తీరానికి తాకుతున్న కెరటాలు

పలుచోట్ల టిడిపి అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మే 13న జరగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కురుపాం టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మేదరగండ, బుడ్డెంఖర్జ, బాలేసు కొత్తవలస గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి ప్రజలకు వివరించారు. ఐదేళ్ల వైసిపి పాలనలో గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి లేదని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి బిడ్డిక పద్మావతి , రాష్ట్ర కార్యదర్శి వైరి వీరేశ్ దేవ్, రాష్ట్ర యువ నాయకులు కోలా రంజిత్ కుమార్, మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కొత్త గూడలో టిడిపి ఆత్మీయ సమ్మేళనం

గుమ్మలక్ష్మీపురం : టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి తెలుగు మహిళా కార్యనిర్వహక కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా మండలంలోని కొత్తగూడలో ఆత్మీయ సమ్మేళనం సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ నాడు మనుషులు కలిశారు.. నేడు మనసులు కలిశాయి అన్నారు. ఎన్నికలకు కేవలం 15 రోజులు మాత్రమే సమయం ఉండడంతో మనసులో ఎటువంటి భావాలు ఉన్నా పక్కన పెట్టి కలిసికట్టుగా పనిచేసి జగదీశ్వరిని గెలిపిద్దాం అన్నారు. అనంతరం పద్మావతిని సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి, జియమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల కన్వీనర్లు కొండయ్య, పాడి సుదర్శన రావు, జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేష్ , అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, నాయకులు కోలా రంజిత్ ఉన్నారు.

కర్రివలసలో టిడిపి ఎన్నికల ప్రచారం

పాచిపెంట : మండలంలోని కర్రివలసలో శనివారం టిడిపి అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు ఎక్కువమంది ఉపాధి హామీ పనుల్లో పాల్గొనడంతో వారి వద్దకే ఆమె వెళ్లి టిడిపి మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలు గురించి వివరించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఆమె కోరారు. ప్రచారంలో మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, రౌతు తిరుపతిరావు, కొత్తల పోలినాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : మండలంలోని కుర్మరాజుపేట, పునికిలివలస, చిన్నవలస గ్రామాల్లో టిడిపి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో టిడిపి కూటమి ప్రభుత్వ ఏర్పాటవుతుందని అప్పుడు సామాన్యులకు, సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపిస్తామని తెలిపారు. దీనికోసం ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను కరపత్రం ద్వారా అందరికీ తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, సర్పంచ్ ఎ.నళిని, నాయకులు పాల్గొన్నారు.

పాచిపెంట : కర్రివలసలో ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి సంధ్యారాణి

టిడిపిలో చేరికలు

కురుపాం : కురుపాం మేజర్ పంచాయతీ పరిధిలో గల చెరువుకొమ్మువలసకు చెందిన వార్డు మెంబర్ కందుల బాలకృష్ణ, ఆ గ్రామంలో 40 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలోకి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం టిడిపిలో చేరారు. వీరికి వీరేష్ చంద్రదేవ్ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, మాజీ ఎంపిపి రమణమూర్తి, నాయకులు మంత్రి త్రిపురనాథ్, కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఆదివారం 28 ఏప్రిల్ 2024

పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రతి పోలింగ్ కేంద్ర వద్ద సౌకర్యాలు కల్పించాలని పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు ప్రమోద్ కుమార్ అన్నారు. కొమరాడలో పర్యటించిన ఆయన కొమరాడ, విక్రంపురం పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు గుర్ కరణ్ సింగ్, కురుపాం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వెంకట రమణ, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు ఇస్తున్న పరిశీలకులు ప్రమోద్‌కుమార్

పోలింగ్ సమయంలో బిఎల్ఒలు జాగ్రత్తగా ఉండాలి : ఆర్ఒ

మే 13న జరగనున్న పోలింగ్ సమయంలో బిఎల్ఒలు కీలకపాత్ర పోషిస్తూ జాగ్రత్తగా ఉండాలని కురుపా నియోజకవర్గ ఎన్నికల రిటైర్నింగ్ అధికారి వివి రమణ అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమరాడ మండలంలోని 60 పోలింగ్ బూతులున్నాయన్నారు. పోలింగ్ సమయంలో బిఎల్ఒలు కీలకపాత్ర పోషించాలని తెలిపారు. పోలింగ్ సమయంలో సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. మండలంలోని 60 పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యాలు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటు హక్కు వేసే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్, ఎంపిడిఒ మల్లికార్జునరావు, బిఎల్ఒలు, ఎన్నికల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : ఆర్ఒ

సీతంపేట : పాలకొండ నియోజకవర్గంలోని ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇస్తోన్న ఎన్నికల శిక్షణ తరగతులను పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ శనివారం పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల శిక్షణ తరగతులను అధికారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలుంటే ఇప్పుడే నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు ఏర్పాట్లు చేయాలి : ఆర్ఒ

ప్రజాశక్తి - పాలకొండ

మే 5 నుండి 9 వరకు జరిగే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ అన్నారు. శనివారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం పాలకొండ హైస్కూలు ప్రాంగణాన్ని ఆర్వో ఎన్నికల, పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సమయంలో ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ఎండ నుంచి రక్షణ కలిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. భద్రతా ఏర్పాట్లు చేయాలని సిఐకి సూచించారు. మండలం వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐ, తహశీల్దార్లు, డీటీలు, ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి వేతనదారులనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

సిపిఎం అరకు ఎమ్‌పి అభ్యర్థిని గెలిపించాలి

ప్రజాశక్తి - భామిని

అరకు సిపిఎం ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనరసయ్యకు సత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సిపిఎం నాయకులు సిర్ల ప్రసాద్ కోరారు. ఈ మేరకు మండలంలోని పెద్దదిమిలి, కొరమ, సతివాడ, పోలవరం పంచాయతీల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిరంతరం గిరిజన హక్కుల కోసం పోరాడుతూ, వారి అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న పాచిపెంట అప్పల నరసయ్యను గెలిపించాలన్నారు. ఆయన గెలిస్తే మన వాణిని పార్లమెంట్ లో వినిపిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఇండియా బ్లాక్ పొందుపర్చిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కొండగొర్రి భాస్కరరావు, సిపిఎం మండల నాయకులు జగన్నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలి

పార్వతీపురం రూరల్ : జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన 598 మంది ఉపాధ్యాయులకు అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెంటనే ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహన్‌రావు డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డైస్ సర్వేలో ఉపాధ్యాయులకు అడిగిన సమాచారం మేరకు ఇంటర్నెట్ లేదని 336 పాఠశాలలు, తాగునీరు లేదని 53 స్కూల్స్, టాయిలెట్స్ లేవని 121 స్కూల్స్, విద్యుత్ సౌకర్యం లేదని 56 , క్లాస్ రూమ్స్ లేవని 32 స్కూల్స్ ఉపాధ్యాయులంతా సర్వేలో సమాచారం ఇవ్వగా వారికి ఇప్పుడు విద్యాశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాల్సి పోయి వాస్తవ సమాచారం ఇచ్చిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. వెంటనే ఈ నోటీసులు ఉపసంహరించుకోవాలని, లేనిచో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రాయగడజమ్ములో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న నాబార్డు అధికారులు

ప్రకృతి వ్యవసాయం భేష్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రాయగడ జమ్ము పంచాయితీలో పరిధిలో గల రాయగడ జమ్ము, గొరడ, పెంగవ, వల్లాడ గ్రామాల్లో నాబార్డ్ సహకారంతో జట్టు ట్రస్ట్ ద్వారా అమలు చేస్తున్న జీవా కార్యక్రమ అమలు తీరును పర్యవేక్షించేందుకు వచ్చిన అసిస్టెంట్ మేనేజర్ డాక్టర్ రేఖ ఎమ్ గోనాల్ రైతులు అమలు చేస్తున్న ప్రకతి వ్యవసాయ విధానాలు చూసి అభినందించారు. సమీకృత వ్యవసాయ విధానాలు, చిరుధాన్యాలు సాగు, శ్రీ వరి, శ్రీ రాగి, పలుపంటల విధానాలు, అంతర పంటల సాగు, వివిధ రకాల పండ్ల మొక్కల సాగు, ఫార్మ్ పాండ్, అజోల్లా సాగు, దేశీ కోళ్లపెంపకం, పశు మూత్ర సేకరణ శాలలు, బయో రిసోర్స్ సెంటర్, రైతు సేవా కేంద్రం, ప్రాసెసింగ్ యూనిట్ మొదలైనవి సందర్శించి రైతులను అభినందించారు. ఈ కార్యక్రమాలను రాబోవు కాలంలో అందరూ కొనసాగించాలని, పర్యావరణాన్ని కాపాడుకోవడంలో సహజ వనరులు సంరక్షించుకోవడంలో ప్రకృతి వ్యవసాయ పాత్ర చాలా ముఖ్యమని అన్నారు. నాబార్డ్ డి.డి.ఎమ్ టి.నాగార్జున మాట్లాడుతూ జట్టు ట్రస్ట్ జీవా పైలెట్ ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, రైతులు వీరి సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ రైతులు తాడంగి బంగార్రాజు, పువ్వల ఈఠె, పువ్వల సావిత్రమ్మ లను అభినందించారు. అందరూ వీరిలా పంటల సాగు చేయాలని సూచించారు. వాసన్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎల్ సన్యాసి రావు మాట్లాడుతూ జట్టు ట్రస్ట్ వినూత్నమైన కార్యక్రమాలు రైతులకు అందిస్తుందని, రైతుల ఆదాయాభివృద్ధిలో వీరి సేవలు ఆదర్శంగా నిలుస్తాయని, ప్రకృతి వ్యవసాయంలో పశు సంపద అవసరం చాలా ఉందని అన్నారు. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ ఇడిప్రాహారాజ్, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ తాడంగి జమ్మయ్య, కోడైరక్టర్ నూకంనాయుడు, కమల కుమారి, జీవా కో ఆర్డినేటర్ ప్రభోదు, గొల్లు మురళీ మోహన్, రైతులు, జీవా - ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పృథ్వీరాజ్ పద్ధతిగా మాట్లాడాలి

ప్రజాశక్తి-పాలకొండ

నటుడు, జనసేన నాయకులు పృథ్వీరాజ్ పద్ధతిగా మాట్లాడుకోవడం నేర్చుకోవాలని వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శి లిల్లీ పుష్పనాథం, పదో వార్డు కౌన్సిలర్ దుప్పాడ పాపి నాయుడు అన్నారు. స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఎవరినైనా పవన్ కల్యాణ్ నాలుగు పెళ్లిళ్లు చేసుకున్నారా అనడం పద్ధతి కాదని, మీకు నచ్చితే నీ కుటుంబ సభ్యులకు ఇచ్చి పవన్ కల్యాణ్‌కి పెళ్లి చేసుకో అంటూ ఎద్దేవా చేశారు. పాలకొండ నియోజకవర్గం కోసం పూర్తిగా తెలుసుకోకుండా మాట్లాడడం పద్ధతి కాదని, దమ్ముంటే చర్చకు సిద్ధమవ్వాలన్నారు.

జగన్ కే మా మద్దతు

వైసిపికే తమ మద్దతు అని మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోషియేషన్ పాలకొండ ప్రతినిధులు ఎస్.తరుణ్, సురేంద్ర, ఆర్.కిరణ్ తెలిపారు. సినీహీరో కృష్ణ అసోషియేషన్ పాలకొండ అధ్యక్షులు లిల్లీ పుష్పనాథం స్వగృహంలో మహేష్ బాబు, జగన్మోహన్ రెడ్డి బ్యానర్లను ప్రదర్శించారు. పవన్ కల్యాణ్ కృష్ణను అవమానించడం సరైంది కాదన్నారు.

1న ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వాలని టిడిపి ర్యాలీ

ప్రజశక్తి-పాలకొండ

ప్రభుత్వం పింఛన్లను లబ్ధిదారులకు వారి వారి ఇంటి వద్దే ఒకటో తేదీనే అందించాలని, వేసవిలో లబ్ధిదారులను ఇబ్బందికి గురిచేయడం తగదని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి అన్నారు. ఈ మేరకు శనివారం ఆమెతో పాటు టిడిపి మండల కన్వీనర్ గండి రామినాయుడు, బిజెపి నాయకులు పూడి తిరుపతిరావు, ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి వైఫల్యాలు, అరాచకాలపై టిడిపి-జనసేన-బిజెపి కూటమి(ఎన్.డి.ఎ) విడుదల చేసిన ఛార్జిషీట్‌ను విడుదల చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మాజీ జెడ్‌పిటిసి సామంతుల దామోదరరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు అంగురూ దశరధనాయుడు, మాజీ ఎంపిటిసి బి.జయలక్ష్మి, మాజీ ఎంపిపి సవర కుంపి, మాజీ సర్పంచ్ కోట సంగంనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : ఆరాచక పాలనను అంతం చేసి కూటమి పాలన కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారని టిడిపి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మే 1వ తేదీనే ఇంటి వద్దకే పెన్షన్లను అందించాలని డిమాండ్ చేశారు. వైసిపి నాయకులు ప్రతిపక్షాలపై నిందలు వేయడానికి వృద్ధులను ఎండలో సచివాలయాలకు తీసుకువెళ్లడంతో ఈనెల 32 మంది చనిపోయారన్నారు. అది చూసైనా మే నెల గురించి ముందు చూపుతో ఆలోచించడం లేదని అన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : వైసిపి ఐదేళ్ల అరాచక పాలనకు మరి కొద్ది రోజుల్లో ప్రజలు ముగింపు పలకనున్నారని టిడిపి నియోజకవర్గ అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి పాలూరు బాబుతో కలిసి వైసిపి ప్రభుత్వంపై చార్జిషీటు విడుదల చేశారు. రాష్ట్రంలో వైసిపి వచ్చిన ఐదేళ్లలో ఒక విధ్వంసం పాలన కొనసాగిందని విమర్శించారు. ఒకవైపు సంక్షేమమంటూ జగన్ రాష్ట్రాన్ని దోచిన విధానాన్ని చూస్తుంటే ఆర్థికవేత్తలు సైతం ముక్కున వేలేసుకుని పరిస్థితి దాపురించిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసిపిని మట్టిలో కలపడం ఖాయమని, మీరు ఎంత డబ్బు ఖర్చు చేసినా ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారని అన్నారు. విలేకరుల సమావేశంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలకు గ్రామస్తులు సహకరించాలి

ప్రజాశక్తి - సీతానగరం

మే 13న జరిగే సాధారణ ఎన్నికల్లో ప్రజలు సహకరించాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని బల్లకృష్ణాపురం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి తగాదాల్లేకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అరాచక కార్యక్రమాలు చేయకూడదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఎస్‌విడి కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డివిఎం మున్సిపల్ హై స్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎంఆర్ నగరం జిల్లా పరిషత్ హై స్కూల్, ఎంఆర్ నగరం ప్రభుత్వ బాలికల పాఠశాల, బెలగాం భాస్కర్ జూనియర్ కళాశాల పార్వతీపురం కేంద్రాలుగా 1315 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపల్ విలియం కేరి తెలిపారు. ఫలితాలు, ర్యాంకులు విడుదలైన వెంటనే పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు జరుగుతాయని ఆయన తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు పునశ్చరణ తరగతులు

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 12వరకు పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ వి. హరగోపాల్ తెలిపారు. ప్రతిరోజు సైన్స్ ఆర్ట్స్ ఒకేషనల్ గ్రూపులో సుమారు 60మంది విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారన్నారు. మిగతా విద్యార్థులు కూడా ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. వచ్చే నెల 20వరకు పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తామని, అలాగే పరీక్ష తప్పిన విద్యార్థులు ఈనెల 30 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చునని పేర్కొన్నారు.

గణేష్ పంతులు కుటుంబానికి పరీక్షిత్ రాజు పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలోని శివన్నపేటకు చెందిన గణేష్ పంతులు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకుని వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్ శనివారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వీప్ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్,డిఆర్‌ఒ

ఓటింగ్ పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచడం, శతశాతం ఓటింగ్ నమోదు చేయించే దిశగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లను చైతన్య పరిచేందుకు కషి చేస్తున్నారు. ఇప్పటికే పింఛన్ దారులు, వికలాంగులు, హిజ్రాలు, యువత కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఓటు గొప్పదనాన్ని వివరిస్తూ కలెక్టరేట్ వద్ద సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేసారు. మోడల్ పోలింగ్ బూత్ ఏర్పాటు చేసి, ఓటింగ్ ప్రక్రియపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు కషి చేస్తున్నారు. ఫ్లాష్ మాబ్ ద్వారా పెద్ద ఎత్తున యువతను ఆకర్షించి, ఓటు వేయడం పౌరుల బాధ్యతగా ఉద్బోధించారు. స్వీప్ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు, ప్రచార కార్యక్రమాన్ని ఉధతం చేసేందుకు గాను ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్లను శనివారం తన ఛాంబర్లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ గోడపత్రికలను అన్ని సచివాలయాల్లో, ఆర్టీసి బస్సుల్లో, గ్రామాల్లో అంటించి ఓటర్లలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెవివి జాతీయ గౌరవాధ్యక్షులు బ్రహ్మారెడ్డి

నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే...

జెవివి గౌరవాధ్యక్షులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం

నవ సమాజాన్ని నిర్మించ గలిగే శక్తి ఉపాధ్యాయులకే ఉందని జనవిజ్ఞాన వేదిక జాతీయ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి అన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులను ఉపాధ్యాయులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దగలిగితే వారి ద్వారా నవ సమాజ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. శనివారం కంటోన్మెంట్‌లో గురజాడ స్కూలులో జెవివి జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ ఆధ్వర్యంలో నవ సమాజం-ఉపాధ్యాయులు పాత్ర అంశంపై ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ నవ సమాజాన్ని నిర్మించాలంటే ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలను నేర్పించాలని అన్నారు. విద్య విజ్ఞానాన్ని అందిస్తే, నైతిక విలువలు నవ సమాజ నిర్మాణానికి ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎంవిఆర్ కష్ణాజి, జెవివి విద్యా విభాగం కన్వీనర్ డాక్టర్ ఏవి రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, సమత విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సుజాత, జెవివి సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్ డప్పు శ్రీను, నగర ప్రధాన కార్యదర్శి పి.షణ్ముఖరావు, జెవివి జిల్లా నాయకులు రమేష్ రాజు, సుంకర సూర్యనారాయణ, శీరాపు శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బిఎస్‌పిని గెలిపిస్తే అభివృద్ధి చేస్తాం'

ప్రజాశక్తి-భోగాపురం

బహుజన సమాజ్ పార్టీకి ఒకసారి అవకాశం ఇస్తే నియోజకవర్గంలో అభివద్ధి చేసి చూపిస్తామని అపార్టీ అభ్యర్థి ఎరుకొండ తేజారాణి అన్నారు. భోగాపురం మండల కేంద్రంలోని ఎస్‌సి,బిసి కాలనీలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఉద్యోగాలు లేక యువత నిరుద్యోగులుగా మారారని అన్నారు. జెట్టీలు లేకపోవడం వల్ల మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలస పరిస్థితి ఉందన్నారు. అందుకు ప్రజలంతా ఏనుగు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. అనంతరం ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు.

భానుడి భగభగలు

- సాలూరులో 45.2 డిగ్రీలు నమోదు
- అల్లాడిపోతున్న జనం
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లాలో గత నెల రోజులుగా భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ నిప్పులు కురిపించడంతో జిల్లా అగ్నిగుండంగా మారింది. పెరిగిన ఉష్ణోగ్రతలతో పాటు వేడి వడగాడ్పులు వీస్తుండడంతో ప్రజలు వేసవితాపాన్ని భరించలేక విలవిలలాడారు. ఉదయం 8 గంటల నుంచి గడప నుంచి బయట దాటడానికి అనేక ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, చిన్నారులు నిప్పులు కొలిమిలా మారిన వాతావరణాన్ని తట్టుకోలేక కొన్నిచోట్ల డీహైడ్రేషన్‌కు లోనయ్యారు. భానుడి తాపానికి జిల్లా ప్రజలు ఎలా ఇబ్బంది పడ్డారో శనివారం నమోదైన ఉష్ణోగ్రతలను చూస్తే అర్థమౌతుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గరుగుబిల్లి, కొమరాడ, సీతంపేట, సీతానగరం మండలాల్లో 44 డిగ్రీలు, సాలూరులో 45.2 డిగ్రీలకు చేరుకున్నాయి. బలిజిపేటలో 43.7, భామినిలో 43.7, మక్కువలో 43. 5, పార్వతీపురం, పాచిపెంట మండలాల్లో 43.8, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో 42.8 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణం వేడెక్కడంతో ఉపాధిహామీ కూలీల పనులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారు. రానున్న రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ, విపత్తు ల నివారణ శాఖకు చెందిన అధికారులు హెచ్చరిస్తున్నందున ప్రజలు గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అధిక ఉష్ణోగ్రతల వలన డిహైడ్రేషన్ పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఉదయం 10గంటల తర్వాత బయటకు రాకుండా, వచ్చినా నూలు దుస్తులు ధరించడం, శీతలపానీయాలు సేవించాలి.

కురుపాం : మన్యం వ్యాప్తంగా శనివారం భానుడి ప్రతాపానికి ప్రజలు విలవిలాడిపోయారు. మన్యంలోని కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో పగటి పూట ఉష్ణోగ్రత 44 డిగ్రీలకు తాకింది. పలు గిరిజన గ్రామాల్లో 45 డిగ్రీల పైబడి ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు వేశాయి. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 5 వరకు ఎండ తీవ్రతతో పాటు తీవ్ర ఉక్కపోతకు గాలి ఆడక జనం అల్లాడిపోయారు. పగటిపూట జనం బయటకు రాలేక పోయారు. సాయంకాలం 5 గంటల తర్వాత ఎండ వేడి తగ్గటంతో కొంత ఉపశమనం పొందారు. ఏప్రిల్ నెలాఖరులోనే ఎండ తీవ్రత ఇలా ఉంటే మే నెలలో ఎంత తీవ్రంగా ఉంటుందోనని జనం భయాందోళనకు గురౌతున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న కురుపాం రహదారి

టిడిపి హామీల చిట్టా... అబద్ధాల పుట్ట

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - సాలూరు

రానున్న ఎన్నికల్లో ప్రజలను మరోసారి మోసగించడానికి టిడిపి కూటమి ప్రకటించిన హామీల చిట్టా అబద్దాల పుట్ట అని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ఖర్చు కన్నా టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ఖర్చు ఎక్కువ అవుతుందని చెప్పారు. నవరత్నాల పథకాల అమలుతోనే రాష్ట్రం దివాళా తీసిందని విమర్శించిన చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలకు ఖర్చు ఎక్కడ నుంచి పెడతారని ప్రశ్నించారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లు అవాస్తవాలు మాట్లాడారని చెప్పారు. వాలంటీర్ వ్యవస్థపై మొదట్లో టిడిపి, జనసేన నాయకులు లేనిపోని విమర్శలు చేశారని, ఆ తర్వాత మాట మార్చారని గుర్తు చేశారు. వాలంటీర్లకు రూ.10వేలు జీతం చేస్తామని చంద్రబాబు నాయుడు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ పట్ల నిర్లక్ష్యం చేసిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన గ్రామాలకు రహదారులు, వంతెనలు నిర్మించిన ఘనత రాజన్నదొరదేనని చెప్పారు. గతంలోనే మాదిరిగా ఉమ్మడి జిల్లాలోని అన్ని ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలనువైసిపి కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలిస్తే మళ్లీ మోసగించడానికే టిడిపి ఆచరణ సాధ్యం కాని హామీలను ప్రకటించిందని చెప్పారు. తన హయాంలో అభివృద్ధి ఎక్కడెక్కడ జరిగిందో చూపించడానికి సిద్ధమని, టిడిపి అనుకూల మీడియా అవాస్తవాలు ప్రచారం చేస్తోందని రాజన్నదొర ఆరోపించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు,జెడ్పీటీసీ మావుడి వాసు నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

వడగాల్పుల నుంచి రక్షణకు

అవగాహన కల్పించండి

ప్రజాశక్తి- విజయనగరం కోట

వడ గాల్పుల నుంచి రక్షణ పొందేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఐఎంఎ వైద్యులకు ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు సూచించారు. విజయనగరంలో నూతనంగా నిర్మించిన ఐ ఎంఎ భవనం, భారతీయ వైద్యుల సంఘం జాతీయ అధ్యక్షుడు డా.అశోకన్ ఈనెల 28న ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో డివిజి శంకర్రావును ఆహ్వానించేందుకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జెసి నాయుడు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ అప్పలనాయుడు వెళ్లారు. ప్రారంభోత్సవం సందర్భంగా జరిగే సభలో జాతీయ స్థాయిలో అమలు కావాల్సిన ఆరోగ్య మ్యానిఫెస్టో, వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు,ప్రజలకు ఉత్తమ వైద్య ఆరోగ్య సేవలు తదితర అంశాలపై చర్చ జరగనున్నాయని తెలిపారు. డాక్టర్ శంకర్రావు మాట్లాడుతూ తీవ్ర వేడిమి వాతావరణం నెలకొన్న దృష్ట్యా ప్రజలు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను,ప్రాథమిక చికిత్సలను ఐఎంఎ వైద్యులు వివిధ మాధ్యమాల ద్వారా, నేరుగా విస్తత ప్రచారం చేయాలని సూచించారు.

అరాచక పాలన అంతం... కూటమి పంతం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అయిదేళ్ల వైసిపి అరాచక పాలన అంతమే ఎన్‌డిఎ కూటమి పంతమని టిడిపి, బిజెపి, జనసేన నాయకులు అన్నారు. ఎన్నికలలో వైసిపికి ఓటు ఎందుకు వేయకూడదో ప్రజలకు వివరిస్తూ, వారు చేసిన అరాచకపాలనపై సోమవారం అశోక్‌బంగ్లాలో ఛార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, పార్లమెంట్ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం అసెంబ్లీ అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశస్విని మాట్లాడారు. నాగార్జున మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో ఎన్నో ప్రగల్బాలు పలికి ప్రజలకు ఆశ చూపి జగన్మోహన్‌రెడ్డి తీవ్రమైన అన్యాయం జగన్మోహన్ రెడ్డి చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినట్టు నుంచి దౌర్జన్యాలు అన్యాయాలు అనాలోచిత విధానాలతో అనగదొక్కుతూ పరిపాలన సాగించారని అన్నారు గ్రామాల్లో రమదారులు లేవని, ప్రజలపై భారాల మోపారని తెలిపారు. 2014లో అమరావతి రాజధానిగా ప్రకటించినప్పుడు అంగీకరించి, నేడు మూడు ముక్కలాట ఆడుతున్నారని దుయ్యబట్టారు. సంపూర్ణ మద్యపాన నిషేధం పక్కన పెట్టి మద్యం దుకాణాలు పెంచారని అన్నారు. రాష్ట్రంలో కక్ష సాధింపు చర్యలే చేపట్టారు తప్ప అభివద్ధి పనులు చేపట్టలేదని తెలిపారు. యశస్విని మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై రూ.13లక్షల కోట్లు అప్పుల భారం వేసి ఒక్కొక్కరు తలపై పది లక్షల అప్పు చూపారన్నారు భూమి, మైనింగ్, ఇసుక దోపిడీకి గురయ్యాయని అన్నారు. ఉత్తరాంధ్రకే తలమానికమైన రుషికొండను బోడికొండగా చేశారన్నారు కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రజావేదికతో కూల్చడం ప్రారంభమైన జగన్ పాలన రాష్ట్రంలో అనేక విధ్వంసాలకు తెరలేపిందని అన్నారు. పూసపాటి అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటూ గాలికి వదిలేసారని అన్నారు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారన్నారు. సమావేశంలోబిజెపి నాయకులు లక్ష్మీ నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు పట్టణ అధ్యక్షులు ప్రసాదు లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు , కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఛార్జిషీట్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు